నమస్తే తెలంగాణ
# హైదరాబాద్
హైదరాబాద్ - మేడ్చల్
15 | హైదరాబాద్, మంగళవారం 12 మార్చి 2024 | HYDERABAD



సికింద్రాబాద్‌లోని ప్రతిష్టాత్మకమైన గణపతి ఆలయం ద్విశతాబ్ది ఉత్సవాలను పురస్కరించుకొని ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం 5:45 గంటల నుంచి వివిధ పూజ కార్యక్రమాలు జరిగాయి. ద్విశతాబ్ది శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. స్వామి వారికి ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ ఓదెల సత్యనారాయణ పట్టు వస్త్రాలను సమర్పించారు. –మారేడ్‌పల్లి, మార్చి 11



ముస్లింలకు పవిత్రమైన రంజాన్ మాసం ప్రారంభమైంది. మంగళవారం తెల్లవారుజాము నుంచి ఉపవాస దీక్షలు చేపట్టనున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం మక్కా మసీదులో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

## ప్రజావాణికి 334 అర్జీలు

### కమిషనర్ అందుబాటులోకి లేకపోవడంపై ఆగ్రహం

సిటీబ్యూరో, మార్చి 11 (నమస్తే తెలంగాణ) : బల్దియా ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో దరఖాస్తులు వెల్లువెత్తాయి. వివిధ సమస్యలపై ప్రజలు అధికారులకు అర్జీలు అందించగా, వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులకు పంపించారు. జీహెచ్‌ఎంసీ వ్యాప్తంగా మొత్తం 334 దరఖాస్తులు వచ్చాయని, ప్రధాన కార్యాలయంలో 257 వస్తే.. జోనల్‌లో మొత్తం 77 అర్జీలు వచినట్లు అధికారులు వెల్లడించారు. చార్మినార్‌లో 1, సికింద్రాబాద్‌లో 5, కూకట్‌పల్లిలో 42, శేరిలింగంపల్లిలో 17, ఖైరతాబాద్‌లో 5, ఎల్బీనగర్‌లో 7 దరఖాస్తులు వచ్చాయన్నారు. ప్రజావాణి కార్యక్రమంలో ఈవీఎస్ జియావుద్దీన్, అడిషనల్ కమిషనర్లు నళిని పద్మావతి, గీతా మాధురి, సత్యనారాయణ, యాదగిరిరావు, జయరాజ్ కెన్నడి, సీసీపీ రాజేంద్రప్రసాద్ నాయక్, చీఫ్ మెడికల్ అధికారి డాక్టర్ పద్మజ తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉంటే ప్రజావాణిలో కమిషనర్ రోనాల్డ్ రాస్ పాల్గొనకపోవడంపై దరఖాస్తుదారులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

## 15న సీడీఎఫ్‌డీలో అంతర్జాతీయ సదస్సు

సిటీబ్యూరో, మార్చి 11(నమస్తే తెలంగాణ) : సెంటర్ ఫర్ డీఎన్‌ఏ ఫింగర్ ప్రింటింగ్ అండ్ డయాగ్నోస్టిక్స్‌లో ఈ నెల 15న అంతర్జాతీయ సదస్సు జరగనున్నది. సీడీఎఫ్‌డీ సెమినార్ హాల్‌లో మధ్యాహ్నం 12 గంటలకు జరిగే సమావేశంలో వియన్నాలోని ఆస్ట్రియన్ అకాడమీ ఆఫ్ సైన్స్‌కు చెందిన ప్రముఖ సైంటిస్ట్ డాక్టర్ ఫ్రెడరిక్ బర్జర్ పాల్గొని 'ద హిస్టోన్ వేరియంట్ హెచ్2ఏ.జీ ఈజ్ ఏ సెంట్రల్ రెగ్యులేటర్ ఆఫ్ ట్రాన్స్‌క్రిప్షన్'' అనే అంశంపై ప్రసంగిస్తారు.

## పేరుకే స్పెషల్ డ్రైవ్

### 'ధరణి' సమస్యలపై పరిశీలించిన దరఖాస్తులు 6వేలే

మేడ్చల్, మార్చి11(నమస్తే తెలంగాణ): ధరణిలో పెండింగ్ సమస్యల పరిష్కారానికి నిర్వహించిన స్పెషల్ డ్రైవ్ పేరుకే అన్నట్లు ఉన్నది. ఈ డ్రైవ్‌లో ఇప్పటివరకు కేవలం ఆరు వేల దరఖాస్తులను మాత్రమే పరిశీలించారు. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో పెండింగ్‌లో 10,251 దరఖాస్తులు ఉండగా, తొమ్మిది రోజుల పాటు నిర్వహించిన స్పెషల్ డ్రైవ్‌లో 6 వేల అర్జీలను మాత్రమే పరిశీలించారు. తొమ్మిది రోజుల్లో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులన్నీ పరిశీలించాలని ప్రభుత్వం ఆదేశించినప్పటికీ ఆశించిన మేర ఆ ప్రక్రియ జరగలేదని తెలుస్తున్నది. దరఖాస్తుల పరిశీలన అనంతరం తహసీల్దార్లు జిల్లా కలెక్టర్ గౌతమ్‌కు జాబితాను సమర్పించారు. అయితే మిగిలిన 4,251 దరఖాస్తుల సంగతేంటని పలువురు ప్రశ్నిస్తున్నారు. స్పెషల్ డ్రైవ్ పూర్తయిన నేపథ్యంలో మిగతా దరఖాస్తులు అసలు పరిష్కరించే అవకాశం ఉంటుందా.. ఉండదా.. అన్న అనుమానాన్ని వ్యక్తం చేస్తున్నారు.

## నేడు ట్రాఫిక్ ఆంక్షలు



సిటీబ్యూరో, మార్చి 11 (నమస్తే తెలంగాణ): కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా సికింద్రాబాద్‌లోని ఇంపీరియల్ గార్డెన్స్‌లో జరిగే బీజేపీ సమావేశానికి హాజరుకానున్నారు. పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించే మహిళా సదస్సులో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాల్గొననున్నారు. అలాగే ఎల్బీ స్టేడియంలో బీజేపీ సమావేశం ఉన్నది. ఈ నేపథ్యంలో ఆయా పరిసర ప్రాంతాల్లో ఉదయం నుంచి రాత్రి వరకు ట్రాఫిక్ ఆంక్షలు ఉంటాయని, వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గాల్లో తమ గమ్యస్థానాలకు చేరుకోవాలని పోలీసులు సూచించారు.

# చెవులకు చిల్లు





### మోతమోగిస్తున్న శబ్దకాలుష్యం
### అరికట్టలేకపోతున్న పోలీసులు
### న్యాయస్థానాలను ఆశ్రయిస్తున్న సామాన్యులు

సిటీబ్యూరో, మార్చి 11 (నమస్తే తెలంగాణ): నగరంలో శబ్దకాలుష్యం మోతమోగిస్తున్నది. ఒకవైపు వాహనాల హారన్లు.. సైలెన్సర్లు..విపరీతమైన ధ్వని పుట్టిస్తుంటే..మరోవైపు రాత్రి వేళల్లో సౌండ్ సిస్టమ్‌ల మోత గుబగుయ్యిమనిపిస్తున్నాయి. నగరంలో శబ్దకాలుష్యం ఈ రేంజ్‌లో ఉంటున్నా.. పోలీసులు సరైన చర్యలు తీసుకోవడం లేదు. దీంతో సామాన్యులు న్యాయస్థానాల తలుపు తడుతున్నారు.



### ఒకప్పుడు శివారు ప్రాంతాల్లో..

ఒకప్పుడు శివారు ప్రాంతాల్లో ఉండే ఫంక్షన్ హాల్స్ నేడు.. కాలనీలో మధ్యలోకి వచ్చేశాయి.. నిబంధనల ప్రకారం రాత్రి 10 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు సౌండ్ సిస్టమ్స్ ఉపయోగించకూడదు. అయితే ఫంక్షన్ హాల్స్‌లో రాత్రి 12 అయినా..కొందరు సౌండ్ సిస్టమ్స్‌ను వాడుతూ.. శబ్ద కాలుష్యానికి కారణమవుతున్నారు. సాధారణంగా ఫంక్షన్ హాల్స్‌లలో ఇలాంటి పరిస్థితి ఉంటుంది.. ఒకటి రెండు రోజులంటే చూసీ చూడనట్లు ఉన్నా.. నిత్యం శబ్దాల మోత మోగుతుండటంతో ఎలా భరించాలని సామాన్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. డయల్ 100కు ఫోన్ చేస్తే కొన్ని సందర్భాల్లో పోలీసులు రానే రాను.. వచ్చినా తాత్కాలికంగా నిర్వాహకులకు చెప్పి..బంద్ చేయించి వెళ్లడం, వెంటనే తిరిగి సౌండ్ సిస్టమ్స్‌ను ప్రారంభించడం జరుగుతున్నది.పోలీసులకు, ఆయా ఫంక్షన్ హాల్ యజమానులకు మధ్య ఉండే సంబంధాలతోనే ఈ వ్యవహారంలో చూసీ చూడనట్లు ఉంటున్నారన్న ఆరోపణలు లేకపోలేదు. ఇలాంటి పరిస్థితుల నేపథ్యంలో ఇటీవల సికింద్రాబాద్‌కు చెందిన ఓ వ్యక్తి రాష్ట్ర ఉన్నత న్యాయస్థానానికి తన ఆవేదనను వ్యక్తం చేస్తూ లేఖ రాశారు. ఆ లేఖను కోర్టు సుమోటగా విచారణకు స్వీకరించింది.

### వాహనదారులపై చర్యలేవీ?

గతంలో తరచూ స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహిస్తూ సౌండ్ పొల్యూషన్‌కు కారణమయ్యే వాహనాదారులపై చర్యలు తీసుకునే వారు. నేడు ఆ పరిస్థితి లేదు. రోడ్లపై శబ్ద కాలుష్యం పెరిగిపోతున్నది. వాహనాలను తనిఖీ చేయడమే కాకుండా సైలెన్సర్లు మరమ్మతులు చేసే మెకానిక్‌లు.. హారన్లను బిగించే కార్ డేకార్స్ నిర్వాహకులతో సమావేశాలు ఏర్పాటు చేసేవారు. చట్ట ప్రకారం అది తప్పుడు అలా చేయకూడదని చెబుతూ, మాట వినని వారిపై చర్యలు కూడా తీసుకునే వారు. నేడు ఆ పరిస్థితి లేదు. అసలు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించేందకే ఇబ్బందిపడుతున్న ట్రాఫిక్ పోలీసులు, ఈ విషయాలను మర్చిపోయారనే విమర్శలు వస్తున్నాయి.

### ఫంక్షన్ హాల్స్‌లో శబ్దానికి పరిమితి

#### రాష్ట్రానికి హైకోర్టు ఆదేశం

హైదరాబాద్, మార్చి 8 (నమస్తే తెలంగాణ) : హైదరాబాద్‌లోని ఫంక్షన్ హాల్స్‌లో శబ్దానికి పరిమితులు ఉన్నాయని హైకోర్టు గుర్తుచేసింది. పరిమితులకు లోబడే శబ్దం ఉండాలని చెప్పింది. నగరంలో ఫంక్షన్ హాళ్లలో శబ్ద నియంత్రణకు సంబంధించి ప్రభుత్వం ఈనెల 5న జారీ చేసిన ఉత్తర్వుల్లోని నిబంధనలు అమలుపై స్థాయీ నివేదిక అందజేయాలని కోరింది. సర్క్యూలర్‌లోని అంశాల అమలు వివరాలు అందజేయాలని పోలీసులకు హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. సికింద్రాబాద్ తాడ్‌బండ్ బోయినపల్లిలోని బ్రాంటియా గార్డెన్స్, ఇంపీరియల్ గార్డెన్స్ ఫంక్షన్ హాళ్లపై చర్యలు తీసుకోవాలని సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డును ఆదేశించింది. ఆ రెండు గార్డెన్స్ లను ప్రతివాదులుగా చేర్చాలని హైకోర్టు రిజిస్ట్రీని ఆదేశించింది. తదుపరి విచారణను ఈనెల 14వ తేదీకి వాయిదా వేసింది.

# నైపుణ్యం పెంచి.. తీర్చిదిద్ది

### వచ్చే నెల 25 నుంచి సమ్మర్ కోచింగ్ క్యాంపులు

#### 44 రకాల క్రీడలపై పిల్లలకు శిక్షణ

సిటీబ్యూరో, మార్చి 11 (నమస్తే తెలంగాణ) : సమ్మర్ కోచింగ్ క్యాంపు నిర్వహణకు బల్దియా సిద్ధమవుతున్నది. వేసవిలో 6 నుంచి 16 ఏండ్లలోపు పిల్లలకు క్రీడా నైపుణ్యాన్ని పెంపొందించి నిష్టాతులైన క్రీడాకారులుగా తీర్చిదిద్దేందుకు ఏటా వేసవి శిక్షణ తరగతులను నిర్వహిస్తున్న బల్దియా.. ఈసారి వచ్చే నెల 25వ తేదీ నుంచి మే 31వ తేదీ వరకు సమ్మర్ కోచింగ్ క్యాంపులు–2024 నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నది. మొత్తం 44 రకాల క్రీడలపై తర్ఫీదు ఇవ్వనున్నారు. జోనల్ కమిషనర్లు, డిప్యూటీ కమిషనర్లు, గేమ్ ఇన్‌స్పెక్టర్లు పర్యవేక్షణలో జరిగే ఈ క్రీడా పోటీలకు అవసరమైన క్రీడా సామగ్రి, కోచ్‌ల నియామకం, ప్రాంగణాలకు సంబంధించి నిర్వహణపై కసరత్తు చేస్తున్నారు.



| | | సద్వినియోగం | వసూలైన ఫీజు (రూ.ల్లో) |
|---|---|---|---|
| ఎల్బీనగర్ | 2022 | 2075 | 31030 |
| | 2023 | 5476 | 66080 |
| చార్మినార్ | 2022 | 4606 | 55660 |
| | 2023 | 8116 | 105680 |
| ఖైరతాబాద్ | 2022 | 5261 | 84490 |
| | 2023 | 11192 | 172600 |
| శేరిలింగంపల్లి | 2022 | 2414 | 44580 |
| | 2023 | 4488 | 81240 |
| కూకట్‌పల్లి | 2022 | 1455 | 25790 |
| | 2023 | 4568 | 74840 |
| సికింద్రాబాద్ | 2022 | 3005 | 49290 |
| | 2023 | 8370 | 111220 |

# బలం లేకున్నా..బల ప్రయోగం

### మీర్‌పేట మేయర్‌పై వీగిన అవిశ్వాసం
### బెడిసికొట్టిన బీజేపీ, కాంగ్రెస్ వ్యూహం

బడంగ్‌పేట, మార్చి11: మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ దుర్గా దీప్‌లాల్ చౌహాన్ పై పెట్టిన అవిశ్వాసం వీగి పోయింది. అవిశ్వాస సమావేశానికి 31 మంది హాజరుకావాల్సి ఉండగా, 29 మందే హాజరయ్యారు. దీంతో కోరం లేని కారణంగా అవిశ్వాసం వీగిపోయినట్లు ప్రిసైడింగ్ అధికారి సూరజ్ కుమార్ వెల్లడించారు. ఇదిలా ఉంటే బీఆర్‌ఎస్‌ను దెబ్బతీసేందుకు ఎలాగైనా మీర్‌పేట మేయర్‌ను పదవి నుంచి దించాలని గత నెల రోజులుగా బీజేపీ, కాంగ్రెస్ నాయకులు ఎత్తులకు పై ఎత్తులు వేశారు. అన్ని పార్టీల కార్పొరేటర్లకు డబ్బులు ఎరవేశారు. బంపర్ ఆఫర్లు ప్రకటించారు. బీజేపీకి మద్దతు ఇవ్వాలని క్యాంపు రాజకీయం నడిపారు. కార్పొరేటర్లను కొనుగోలు చేసేందుకు అన్ని మార్గాలను ఉపయోగించుకున్నారు. కాంగ్రెస్ పార్టీలోని కొందరు పెద్ద మనుషులు రంగ ప్రవేశం చేసి బీజేపీకి మద్దతు ఇవ్వడానికి వెనుకాడలేదు. క్యాంపు రాజకీయాల్లో బీజేపీ కార్పొరేటర్లకు ఆశ్రయం ఇచ్చింది కూడా కాంగ్రెస్ నేతనే అని తెలిసింది. చివరకు ఓ బీజేపీ కార్పొరేటర్ కాంగ్రెస్‌లో కలిసేందుకు కూడా సిద్ధమయ్యారు. ఇలా కీలక నేతలు చక్రం తిప్పాలని చేసిన ప్రయత్నం ఫలించలేదు. బీజేపీ వ్యూహం బెడిసి కొట్టింది. కాంగ్రెస్ నాయకులు వేసిన ఎత్తులు చిత్తయ్యాయి. ఎట్టకేలకు బీఆర్‌ఎస్‌దే పై చేయి అయ్యింది. బీజేపీ, కాంగ్రెస్ నాయకులు వేసిన ఎత్తులను ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి చాకచక్యంగా చిత్తు చేశారు.

### మొత్తం 46 మంది కార్పొరేటర్లు

మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్‌లో మొత్తం 46 మంది కార్పొరేటర్లు ఉన్నారు. అందులో 22 మంది బీఆర్‌ఎస్ కార్పొరేటర్లు, 14 మంది బీజేపీ, 10 మంది కాంగ్రెస్ కార్పొరేటర్లు ఉన్నారు. బీజేపీకి బలం లేకున్నా బల నిరూపణకు పోయి భంగపడింది. బీఆర్‌ఎస్, కాంగ్రెస్ కార్పొరేటర్లకు డబ్బుల ఎరవేసి మేయర్ పీటం దక్కించుకోవాలని ప్రయత్నించింది. చివరకు కోరం లేక అవిశ్వాసం వీగిపోవడంతో బీజేపీ, కాంగ్రెస్ నాయకులు కంగుతున్నారు.

ఇదిలా ఉంటే మీర్‌పేట మేయర్‌పై పెట్టిన అవిశ్వాసానికి మద్దతు ఇచ్చిన బీఆర్‌ఎస్ కార్పొరేటర్లపై చర్యలు తప్పవని రంగారెడ్డి జిల్లా బీఆర్‌ఎస్ అధ్యక్షులు మంచిరెడ్డి కిషన్ రెడ్డి వెల్లడించారు.

# ఇద్దరు చిన్నారులకు కాలేయ మార్పిడి

### ఉస్మానియా దవాఖాన ఘనత



వైద్యులను అభినందిస్తున్న ఉస్మానియా దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ నాగేందర్

సుల్తాన్‌బజార్, మార్చి 11: ఉస్మానియా వైద్యులు మరోసారి ఘనత చాటారు. ఐదు రోజుల వ్యవధిలోనే ఇద్దరు బాలికలకు విజయవంతంగా కాలేయ మార్పిడి శస్త్రచికిత్సలను నిర్వహించారు. సోమవారం దవాఖానలోని ఆడిటోరియంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో సూపరింటెండెంట్ డాక్టర్ నాగేందర్ వివరాలు వెల్లడించారు. హుజురాబాద్ కమలాపూర్‌కు చెందిన సింధూజ(11), భువనగిరికి చెందిన వైష్ణవి(13)ల కాలేయాలు దెబ్బతిన్నాయి. దీంతో ఈ ఇద్దరు బాలికలకు లివర్ ట్రాన్స్‌ప్లాంట్ చేయాల్సిన అవసరాన్ని గుర్తించారు ఉస్మానియా వైద్యులు. బ్రెయిన్‌డెడ్ అయిన వారి నుంచి సేకరించిన కాలేయాలను వారికి విజయవంతంగా అమర్చారు. 5 రోజుల వ్యవధిలో సుమారు 20 గంటల పాటు శ్రమించి రెండు కాలేయ మార్పిడిలను విజయవంతంగా నిర్వహించిన సర్జికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ హెచ్‌వోడీ డాక్టర్ మధుసూదన్,ప్రొఫెసర్ డాక్టర్ సుదర్శన్, అనస్థీషియా విభాగాధిపతి డాక్టర్ పాండు నాయక్, డాక్టర్ పావని, డాక్టర్ మాధవిలను సూపరింటెండెంట్ ప్రత్యేకంగా అభినందించారు. లివర్ ట్రాన్స్‌ప్లాంట్ పూర్తి చేసుకున్న ఇద్దరు బాలికలు పూర్తిగా ఆరోగ్యంగా ఉన్నారని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో దవాఖాన అడిషనల్ సూపరింటెండెంట్ డాక్టర్ త్రివేణి, సీఎస్ అడ్మిన్ ఆర్‌ఎంవో–1 డాక్టర్ శేషాద్రి, డిప్యూటీ సీఎస్ అడ్మిన్ ఆర్‌ఎంవోలు డాక్టర్ సాయిశోభ, డాక్టర్ బండారి శ్రీనివాసులు, ఆర్‌ఎంవోలు డాక్టర్ సిద్ధిఖీ, డాక్టర్ సుష్మ తదితరులు పాల్గొన్నారు.

# సమన్వయ సమావేశం


సిటీబ్యూరో, మార్చి 11 (నమస్తే తెలంగాణ):పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో హైదరాబాద్ జిల్లాలోని రెండు నియోజకవర్గాలకు సంబంధించిన ఆయా శాఖల అధికారులతో నగర పోలీస్ కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా ఎన్నికల అధికారి (జీహెచ్‌ఎంసీ కమిషనర్) రోనాల్డ్ రాస్ సోమవారం సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. అదనపు నోడల్ అధికారులు, సబ్ నోడల్, ఆర్వో, ఏఆర్‌లతో సమావేశమయ్యారు. హైదరాబాద్, సికింద్రాబాద్ పార్లమెంట్ పరిధిలోని ఆయా అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించిన అధికారులు, పోలింగ్ స్టేషన్లు, సమస్యాత్మక పోలింగ్ స్టేషన్లు తదితర అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో నగర అదనపు సీపీ విక్రమ్ సింగ్ మాన్ తదితరులు పాల్గొన్నారు.



# మూసీ..సమగ్రాభివృద్ధి

### రివర్ ఫ్రంట్ అగ్రిగేట్ మాస్టర్ ప్లాన్
### కన్సల్టెన్సీల ఎంపిక గడువు పొడిగింపు
### ఈనెల 14 వరకు అవకాశం

సిటీబ్యూరో, మార్చి 11(నమస్తే తెలంగాణ): మూసీ నది సమగ్రాభివృద్ధి కోసం తెలంగాణ ప్రభుత్వం అగ్రిగేట్ మాస్టర్‌ప్లాన్‌ను రూపొందిస్తున్నది. ఈ మాస్టర్‌ప్లాన్‌లో నది మొత్తం విస్తీర్ణం, దాని పరిసర ప్రభావ ప్రాంతాలను పరిగణలోకి తీసుకోనున్నారు. ఉస్మాన్‌సాగర్(గండిపేట) జలాశయం దిగువ భాగం నుంచి మొదలై నగరానికి తూర్పు దిక్కున ఉన్న గౌరెల్లి సమీపంలోని ఔటర్ రింగు రోడ్డు సరిహద్దు వరకు, అదేవిధంగా మరో జలాశయమైన హిమాయత్‌సాగర్ దిగువ ప్రాంతం నుంచి బాపుఘాట్ వద్ద మూసీ, ఈసీ నదుల సంగమం వరకు కలిపి మొత్తం 59 కి.మీ మేర ఉన్న నదీ పరివాహక ప్రాంతానికి సంబంధించి అగ్రిగేట్ మాస్టర్‌ప్లాన్‌ను రూపొందించనున్నారు. ఈ మేరకు కన్సల్టెన్సీల ఎంపికకు టెండర్లు పిలిచారు. దీని గడువు ఈ నెల 7 వరకు ఉండగా, 14వ తేదీకి పొడిగించారు. మూసీ నది తీర ప్రాంత అభివృద్ధిపై సీఎం రేవంత్‌రెడ్డి అనేక సార్లు సమీక్ష చేశారు. ఈ నేపథ్యంలోనే టెండర్లలో పలు మార్పులు చేసి... మళ్లీ గడువును పెంచారు. మూసీ పరిరక్షణ కోసం రూపొందించే అగ్రిగేట్ మాస్టర్ ప్లాన్‌లో 5 అంశాలకు ప్రాధ్యానం ఇస్తున్నారు. ఇందులో బ్లూ మాస్టర్ ప్లాన్, మార్కెట్ ఫెసిబిలిటీ స్టడీ, ల్యాండ్ యూజ్ మాస్టర్ ప్లాన్, ట్రంక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, ఫైనాన్షియల్ మాస్టర్ ప్లాన్లు ఉంటాయి.



### కన్సల్టెన్సీల ఎంపిక...

గత నెలలో ప్రభుత్వం గత నెలలో సిమ్యులేషన్ ఫర్ హైడ్రాలిక్స్ పేరుతో రూపొందించే ప్రాజెక్టుకు కన్సల్టెన్సీల ఎంపికకు టెండర్‌ను పిలిచింది. మొత్తం 8 మంది కన్సల్టెన్సీలను ప్రాథమికంగా ఎంపిక చేశారు. ఈ జాబితాలో ఆర్వీ అసోసియేటెడ్ ఆర్కిటెక్ట్ ఇంజినీర్స్ అండ్ కన్సల్టెంట్స్, సెకాన్ ప్రైవేట్ లిమిటెడ్, వ్యాప్‌కోస్ లిమిటెడ్, వోయాంట్స్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్, ట్రాక్టెబెల్ ఇంజినీర్స్ ప్రైవేట్ లిమిటెడ్, ఎన్‌ఎస్‌ఎస్ అసోసియేట్స్ కన్సల్టింగ్ ఇంజినీర్స్, షా టెక్నికల్ కన్సల్‌టెంట్స్, ఎన్‌కె బిల్డ్‌కాన్ ప్రైవేట్ లిమిటెడ్‌లు ఉన్నాయి. కాగా, ఒకేసారి మూసీ నది తీర ప్రాంత అభివృద్ధికి సంబంధించి రకరకాల ప్రణాళికలను రూపొందిస్తూ.. క్షేత్ర స్థాయిలో మూసీ సరిహద్దులను నిర్ణయించేందుకు అధికారులు జియోగ్రాఫికల్ సర్వేను నిర్వహిస్తున్నారు.